సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



ముగిసిన పెద్ద దర్గా ఉరుసు

పెద్ద దర్గాలో హజరత్ సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ సాహెబ్ ఉరుసు ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. -8లో..



విశాఖ, గుంటూరు జట్ల విజయం

కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన ఏసీఏ అండర్-19 జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖ, గుంటూరు జట్లు విజయం సాధించాయి. -8లో..

గరిష్టం/కనిష్టం
35.6/24.6

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.6 - 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో 22 మిల్లీమీటర్ల వర్షం

కడప అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో మంగళవారం తెల్లవారుజామున వర్షం కురిసింది. కడపలో అత్యధికంగా 22.2 మిల్లీమీటర్ల వర్షపాత నమోదవగా, అట్లూరులో 10.2, సికెదిన్నె, సిద్ధవటం మండలాల్లో 5.2, వల్లూరులో 3.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ నెల 24వ తేదీ వరకు పలు మండలాల్లో చిరు జల్లులతోపాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, కేవీకే వాతావరణ విభాగ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల ఉన్నతీకరణకు వెబ్‌సైట్

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు, ఉన్నతీకరణకు ఇకపై ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ప్రభుత్వం తాజాగా ఇందుకోసం https://cse.ap.gov.in/psis/loginhome వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు డీఈఓ తెలిపారు.

21న జిల్లా స్థాయి సెమినార్

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లా పులివెందులలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 21న మధ్యాహ్నం 2 గంటలకు ఆహారంలో 'చిరుధాన్యాలు.. మంచి పౌష్టికాహారం.. ఆహార అలవాటు' అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ చర్చా కార్యక్రమంలో అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. ప్రతి విద్యార్థి ఓ పోస్టర్ ద్వారా అంశంపై చక్కగా వివరించాల్సి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలుంటే జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి 9441035830ను సంప్రదించాలని తెలిపారు.

రైతులకు బిందు సేద్య పరికరాలు

కడప అగ్రికల్చర్: జిల్లాలో దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే బిందు, తుంపర సేద్య పరికరాలు అందజేయాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి సూచించారు. వైఎస్సార్ జిల్లా పీడీ కార్యాలయంలో కంపెనీ ప్రతినిధులు, సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10,500 హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 4881 హెక్టార్లకు కలెక్టర్ అనుమతి లభించిందన్నారు. 14,993 మంది రైతులను చరవాణిలో సంప్రదించి పరికరాలు అందేలా చూస్తామన్నారు. ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని తమ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.సురేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఓ బ్లాక్‌లో ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ మేళాకు అపోలో ఫార్మసీ లిమిటెడ్, నవభారత్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, ఎల్ఐసీ సంస్థల ప్రతినిధులు వస్తారన్నారు. అపోలో ఫార్మసీ కంపెనీలో హెచ్ఆర్ అసిస్టెంట్, ఆడిట్ అసిస్టెంట్, ఫారాసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, రీటైల్ ట్రైనీ అసోసియేట్ ఉద్యోగాలకు పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఫార్మసీ డిప్లొమా కలిగి 19-30 సంవత్సరాల మధ్య ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. నవభారత్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ సంస్థలో సేల్స్ రెప్రజెంటేటివ్ ఉద్యోగానికి పది, ఇంటర్, డిగ్రీ చదివి 19-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎల్ఐసీలో అడ్వయిజర్ ఉద్యోగానికి పది, ఇంటర్ చదివి 18 సంవత్సరాలకు పైగా వయస్సు కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారంతా తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, తీసుకుని రావాల్సి ఉంటుందని వివరించారు.

కొత్త వెలుగు

- ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు మోక్షం
- ఉద్యోగులకు ఆది నుంచి అండగా ప్రభుత్వం
- తొలి విడతలో 51 మందికి పోస్టింగ్
- తాజాగా 90 మందికి ఉపాధి కల్పించేందుకు కసరత్తు
- కలెక్టర్‌కు ఫైలును పంపిన ఆర్టీసీ అధికారులు



కారుణ్య నియామకాలు పొందిన అభ్యర్థులతో అధికారులు (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీకి అనేక సంవత్సరాల పాటు సేవలందించి పలువురు కార్మికులు మృతి చెందితే గత టీడీపీ ప్రభుత్వం కనీసం బాధితులకు ఉద్యోగాలు ఇచ్చిన పాపాన పోలేదు. ఆయా ఉద్యోగుల కుటుంబాల సంక్షేమాన్ని పక్కన పెట్టేసింది. కారుణ్య నియామకాలు కల్పించాలని కోరితే గత ప్రభుత్వం మొండి చేయి చూపింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నపుడు ప్రజా సంకల్ప పాదయాత్రలో ఆర్టీసీ కార్మికులు తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లినపుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని హామీ ఇచ్చారు. సీఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఇచ్చిన మాటను నెరవేర్చారు. అలాగే అత్యధిక పింఛన్ తీసుకునేలా చర్యలు చేపట్టి ఆర్టీసీ ఉద్యోగుల్లో సంతోషాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలోనే ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు శ్రీకారం చుట్టి బాధలో కూరుకుపోయిన ఆర్టీసీ కుటుంబాలకు శుభవార్త చెప్పారు. వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపారు. 2016 నుంచి 2019 వరకు తొలి విడతలో దాదాపు 51 మందికి వివిధ హోదాల్లో పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు.

మరోసారి 'కారుణ్యం'

ఏపీఎస్ ఆర్టీసీలో మృతి చెందిన ఉద్యోగుల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం మరికొందరికి కారుణ్య నియామకాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇటీవలే సర్కార్ నుంచి అనుమతులు రావడంతో అధికారులు ఫైల్ సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 2020 జనవరి, 1 తర్వాత 90 మంది మృతి చెందారు. ఆయా కుటుంబాలకు సంబంధించి కలెక్టర్‌కు నివేదికలను పంపించారు. త్వరలో నియామకాలు చేపట్టనున్నారు.

మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులకు తీపి కబురు

ఆర్టీసీలో పనిచేస్తూ అనారోగ్యం బారిన పడి మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల్లోనూ ఆశలు చిగురిస్తున్నాయి. 19/2015 సర్క్యులర్ ప్రకారం మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పోస్టింగ్స్ ఇవ్వాల్సి ఉంది. ఎనిమిది సంవత్సరాల నుంచి ఈ నియామకాలు చేపట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 మంది ఉండగా, జిల్లాలో 20 మంది వరకు ఎదురు చూస్తున్నారు. త్వరలో వీరికి కూడా తీపి కబురు అందించేందుకు ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



నా పేరు ఎం.ప్రసన్నకుమార్. మా నాన్న బద్వేలు డిపోలో అసిస్టెంట్ డిపో క్లర్క్‌గా పనిచేస్తూ 2017లో మృతి చెందారు. నేను బీటెక్ చదివి నిరుద్యోగిగా ఉన్నాను. ఇంతవరకు ఏ ప్రభుత్వం కూడా ఇంత తొందరగా మాకు ఉద్యోగాలు కల్పించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అంచెలంచెలుగా ఉద్యోగాలు భర్తీ చేస్తూ వస్తోంది. అందులో నాకు కూడా ఉద్యోగం లభించడం సంతోషదాయకం. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

చాలా సంతోషదాయకం



నా తండ్రి రఫీ కడప డిపోలో అసిస్టెంట్ డిపో క్లర్క్‌గా పనిచేస్తుండేవారు. ఆయన అనారోగ్యంతో 2018లో మృతి చెందారు. నేను పదో తరగతి వరకు చదువుకున్నాను. నాకు ఆర్టీసీలో అసిస్టెంట్ శ్రామిక్ ఉద్యోగం లభించడం సంతోషదాయకం. ముఖ్యమంత్రి నిర్ణయంతోనే నాకు ఉద్యోగం లభించింది.

– ఎస్.గౌస్‌బాషా, కడప

కలెక్టర్‌కు ఫైల్ పంపాం!



ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. గతంలో 51 మందికి పోస్టింగ్ ఇచ్చాం. మరోసారి వివరాలను తెప్పించుకున్నాం. దాదాపు 90 మంది వరకు ఉన్నారు. ఆర్టీసీలో ఖాళీలను గుర్తించి ఫైల్‌ను కలెక్టర్‌కు పంపాం. కలెక్టర్ ఆదేశాల మేరకు నియామకాలు చేపడతాం.

– పాలిమేర గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

23 నుంచి ఎస్‌జీఎఫ్ అండర్-19కు ఎంపికలు



కడప స్పోర్ట్స్: ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడలకు ఉమ్మడి జిల్లాల పరిధిలో అర్హులను ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగం జిల్లా కార్యదర్శి పి.శారద తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో 24 క్రీడాంశాలకు సంబంధించిన ఎంపికలు ఉంటాయన్నారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు కళాశాల ప్రిన్సిపల్ జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్, పదో తరగతి మార్కుల జాబితా తీసుకురావాలని సూచించారు.

తేదీ	క్రీడాంశం	వేదిక
23-09	కరాటే, తైక్వాండో, స్కేటింగ్	ప్రభుత్వ జూనియర్ కళాశాల, రైల్వేకోడూరు
24-09	సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, క్రికెట్	ఏపీ మోడల్ కళాశాల, పుల్లంపేట
25-09	స్కిప్పింగ్, ఫెన్సింగ్	ప్రభుత్వ జూనియర్ కళాశాల, రైల్వేకోడూరు
26-09	త్రోబాల్, యోగ, వాలీబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్	మేధా జూనియర్ కళాశాల, మైదుకూరు
27-09	అథ్లెటిక్స్	మేధా జూనియర్ కాలేజ్, మైదుకూరు
30-09	ఖోఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, రగ్బీ, బాస్కెట్‌బాల్	ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, గండి
03-10	టేబుల్ టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, టెన్నిస్	ప్రభుత్వ జూనియర్ కళాశాల, పులివెందుల

కార్డులకు చెల్లుచీటీ

వాహనంపై వెళుతున్నప్పుడు ఎక్కడో ఒక చోట విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ లేదా రవాణా శాఖ అధికారులు ఆపి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ చూపు అని అడుగుతుంటారు. ఆ సమయంలో ఇంట్లో పెట్టి వచ్చా, మర్చిపోయాననో చెప్పి బయటపడుతుంటాం. ప్రస్తుతం ఈ విధానానికి రవాణా శాఖ స్వస్తి పలి నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

ఆర్‌సీ, లైసెన్సులకు ఇక డిజిటల్ పత్రాలు



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

కడప వైఎస్ఆర్‌సర్కిల్: కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం కార్డులకు చెల్లుచీటి పడనుంది. నూతన విధానంలో కార్డులు ఇవ్వకుండా ఆన్‌లైన్‌లోనే లైసెన్సు పత్రాలు వాహనదారుడి ఫోన్‌కు పంపనున్నారు. ఆర్సీకి రూ.235 రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.


చోదకులు ఇలా చేయాలి

రవాణా శాఖ వెబ్‌సైట్ https: apsrtacitizen. epragathi. org నుంచి ఫారం 6 లేదా 23ను డౌన్‌లోడ్ చేసుకొని ధ్రువ పత్రాన్ని తీసుకోవాలి. లేదా ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఏపీఆర్‌టీఏసిటిజన్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాటిని నేరుగా ప్రింట్ తీసుకుని లేదా ఫోన్‌లో భద్రపరచుకుని అధికారులు అడిగినప్పుడు చూపే అవకాశాన్ని కల్పించారు.

దేశంలో ఎక్కడైనా తనిఖీలు.....

దేశం మొత్తం ఒకే డ్రైవింగ్ లైసెన్స్ ఉండేలా కేంద్ర ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకువచ్చింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. కార్డులు కాకుండా ఫోన్‌లో భద్ర పరచుకున్న లైసెన్సు, ఆర్సీ పత్రాలను దేశంలో ఎక్కడైనా తనిఖీ సమయంలో అధికారులకు చూపించవచ్చు. ఈ విధానం తనిఖీలకు సులభంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఇక కార్డులు ఉండవు



నూతన విధానంలో లైసెన్సు మంజూరు తర్వాత ప్రింటెడ్ కార్డులివ్వరు. ఆన్‌లైన్‌లోనే మాత్రమే పత్రాలు పంపుతారు. వాహనదారుడు ప్రింట్ తీసుకొని తన వద్ద ఉంచుకోవచ్చు. ఫోన్‌లో భద్ర పరుచుకోవచ్చు. అధికారుల తనిఖీ సమయంలో చూపితే సరిపోతుంది.

–ఈ.మీరా ప్రసాద్, ఉప రవాణాశాఖ కమిషనర్, వైఎస్ఆర్ జిల్లా

వాతాపి గణపతిం భజే..

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- ఊరంతా సందడి
- తిరునాలను తలపించిన భక్తజనం



మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె కాట్లాటపల్లె రోడ్డులో రక్తదాతగా వినాయకుడు


కడప కల్చరల్ : ఆది పూజల దేవుడు, శివపార్వతుల ముద్దుల తనయుడు గణనాథుడు, సిద్ధి, బుద్ధి ప్రదాత, విఘ్న నాయకునికి సోమ, మంగళవారాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. విగ్రహాలుగల పందిళ్లన్నీ ఉదయం, సాయంత్రం భక్తజనంతో పోటెత్తాయి. పిల్లలు, పెద్దలు నిలువెత్తు గణపతి మూర్తులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యార్థులు ఇళ్లలో పూజలు నిర్వహించే సమయంలో తమ పాఠ్య పుస్తకాలను పూజలో ఉంచారు. తమకు చదువులు బాగా రావాలని కోరుకున్నారు. కుటుంబాలతోసహా ఉదయం, సాయంత్రం సమీపంలోని వీలైనన్ని పందిళ్లలోని స్వామిని దర్శించుకున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పౌరాణిక, భక్తి నాటక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భజనలు నిర్వహించారు.

మట్టి గణపతి మనసా స్మరామి

వినాయక చవితి నాడు మట్టి విగ్రహాలకే పూజలు చేయాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను వాడవద్దని ప్రచారం జరుగుతుండడం కొద్దిగా ఫలితాన్ని ఇచ్చేనట్లేనని చెప్పవచ్చు. పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రసార మాధ్యమాలు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పలుచోట్ల చిన్నసైజు మట్టి విగ్రహాలను భక్తులకు ఉచితంగా అందజేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు, దాదాపు అదే స్థాయిలో స్థానిక ప్రముఖులు కూడా మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, స్థానిక ప్రముఖులు కార్యక్రమంలో పందిళ్ల వద్ద పూజలు నిర్వహించారు.

సందడే సందడి

మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె కాట్లాటపల్లె రోడ్డులో రక్తదాతగా వినాయకుడు దర్శనమిచ్చాడు. ఇందులోని సామాజిక కోణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రైల్వేకోడూరు పట్టణంలో గణేశుడికి లక్ష రూపాయల నగదుతో తులాభారం ఏర్పాటు చేయడం విశేషం. అలాగే రాజంపేట, రాయచోటి, పీలేరు తదితర ప్రాంతాల్లో వందలాదిగా విగ్రహాలు కొలువుదీరాయి. స్వామి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో వీధులన్నీ జనమయమయ్యాయి.



కడప బీకేఎం స్ట్రీట్‌లో గవ్వల గణేశుడు



ప్రొద్దుటూరు శివాలయంలో కొలువుదీరిన పంచవింశతి ముఖ మహా గణపతి



రైల్వేకోడూరు పట్టణం పాత బజార్‌లో రూ.లక్ష నగదుతో లంబోదరుడికి తులాభారం

వంట ఏజెన్సీలకు ఊరట

- మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన వంటపాత్రలు
- 1938 పాఠశాలల్లో పంపిణీకి ఏర్పాట్లు

కడప ఎడ్యుకేషన్: మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వంట పాత్రలు లేక ఇబ్బంది పడడం గమనించిన ప్రభుత్వం స్టెయిన్‌లెస్ స్టీల్ డబరాలు, బేసిన్లు, ఇతర మూడు రకాల సామగ్రి పంపిణీ చేయాలని నిర్ణయించింది. జిల్లా అధికారులు పంపిన ప్రతిపాదనలను ఆమోదించి అంగీకారం తెలుపడంతో త్వరలో ఈ సామగ్రి పాఠశాలలకు చేరనుంది.

- వైఎస్సార్ జిల్లాలోని 1654 ప్రాథమిక, 135 ప్రాథమికోన్నత, 255 ఉన్నత పాఠశాలల్లో 1,36,444 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ చదువుతోపాటు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న గోరుముద్ద' పథకం ప్రవేశపెట్టారు. చిన్నారులకు ఐదు రోజులు గుడ్డు, చిక్కీలతోపాటు చక్కటి భోజనం అందిస్తున్నారు.

కేటగిరీ	ఎంపికైన పాఠశాలలు
ఎ కేటగిరి	1022
బి కేటగిరి	380
సి కేటగిరి	303
డి కేటగిరి	125
ఈ కేటగిరి	54
ఎఫ్ కేటగిరి	54




పిల్లలకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకురాలు

నిత్యం భోజనం వండివార్చే ఏజెన్సీలకు వంట పాత్రల సమస్య వేధించింది. గత ప్రభుత్వం 2010లో పాత్రలు ఇచ్చి అనంతరం పట్టించుకోలేదు. దీంతో పాడైపాయినా వాటిలో చేసేందుకు మహిళలు అవస్థ పడ్డారు. ఇటీవల పాఠశాలల్లో వసతులు పెరగడం, విద్యార్థుల సంఖ్య రెట్టింపవడంతో సమస్య తీవ్రమైంది. ఈనేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్న భోజనంలో మార్పులు చేసి అందుకు తగ్గట్టుగా వటపాత్రలు సమకూర్చారు. 106 పాఠశాలల్లో ఇస్కాన్ భోజనం అందిస్తుండగా, మిగిలిన 1938 పాఠశాలకు వంట పాత్రలు అందివ్వనున్నారు.

విద్యార్థుల సంఖ్యను బట్టి...

విద్యార్థుల సంఖ్యను బట్టి వంట పాత్రలు మంజూరు చేసేందుకు పాఠశాలలను ఆరు కేటగిరీలుగా విభజించారు. 30 లోపు విద్యార్థుల సంఖ్య ఉన్న చోట ఎ కేటగిరీగా, 31 నుంచి 50 వరకు ఉంటే బి, 51-150 మధ్య సి, 151-250 మధ్య డి, 251-400 మధ్య ఇ, 400-అంతకన్నా ఎక్కువ ఉంటే ఈ కేటగిరీలుగా పాఠశాలలను విభజించారు. ఎ,బి కేటగిరీలకు ఐదు, సి,డి కేటగిరీలకు 6, ఇ,ఎఫ్ కేటగిరీలకు 11చొప్పున స్టెయిన్‌లెస్ స్టీల్ డబరాలు, బేసిన్లు, కురిపి, కడాయి, హస్తాలు, తదితర సామగ్రి అందించనున్నారు.

త్వరలో పాఠశాలలకు అందిస్తాం...



జిల్లా వ్యాప్తంగా పాఠశాలల వారీగా వంట పాత్రలు రానున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన కేటగిరీల ప్రకారం పంపుతాం. వాటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వంట ఏజెన్సీలకు అందజేస్తారు. దీంతో వంట నిర్వాహకుల కష్టాలు తీరుతాయి.

–ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

గండి హుండీల ఆదాయం లెక్కింపు



గండి ఆలయ హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం హుండీల ఆదాయాన్ని లెక్కించినట్లు ఆలయ సహాయకమీషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు.33రోజులకు గాను రూ.34,24,967లు నగదు,17 గ్రాముల 300 మి.గ్రా బంగారుతో పాటు 643గ్రాముల వెండి వచ్చి నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో కడప దేవదాయశాఖ ఇన్ స్పెక్టర్ జనార్దన్, ఆలయ చేర్మెన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్,ఆలయ ప్రధాన,ఉపప్రధాన,ముఖ్య అర్చకులు కేసరి,రాజా రమేష్,రాజగోపాలాచార్యులు సిబ్బంది, చక్రాయపేట ఏపీజీబి మేనేజర్ అశోక్,కుమార్,ఆర్కేవ్యాలీ సీఐ గోవిం దరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ సాగు పెంచాలి

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ప్రకృతి వ్యవసాయ సాగును పెంచేందుకు సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కడప ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలపైన ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగుల నివారణ మందులు లేని వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు, ఆదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి, డీపీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

ప్రొద్దుటూరు క్రైం : తాళం వేసిన ఇంటికి దొంగలు కన్నం వేశారు. స్థానిక గోకుల్‌నగర్‌లోని బైసాని సుబ్బరామయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు రూ.3.50 లక్షలు, రూ. 18 గ్రాముల బంగారు చైన్‌ను దోచుకొని వెళ్లారు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోకుల్‌నగర్‌కు చెందిన సుబ్బరామయ్య తన ఇంటి సమీపంలోని పాలిటెక్నిక్ కాలేజీ ఎదురుగా హోటల్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్దకు వెళ్లారు. పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకొని రాత్రి 10.40 సమయంలో వారు ఇంటికి వచ్చేసరికి ఇంట్లోని వస్తువులన్నీ చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.3.50 లక్షలు నగదుతో పాటు రూ.18 గ్రాముల బంగారు డాలర్ చైన్ కనిపించలేదు. ఇంటి వెనుక వైపున ఎగ్జాస్టర్ ఫ్యాన్ కోసం ఏర్పాటు చేసిన రంధ్రం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించారు. ఈ మేరకు సుబ్బరామయ్య టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు.

ముగిసిన పెద్ద దర్గా ఉరుసు

భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతెహా

కడప కల్చరల్ : కడప అమీన్‌పీర్ దర్గాలో హజరత్ సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ సాహెబ్ ఉరుసు ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరిరోజు సందర్భంగా దర్గా ప్రాంగణంలో పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తమ ఇంటి నుంచి ఊరేగింపుగా దర్గాకు చేరుకుని గురువుల మజార్ వద్ద ప్రార్థనలు నిర్వహించి ఫాతెహా చేశారు. ప్రార్థనలనంతరం గంధం ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పీఠాధిపతి వద్ద అనుమతి తీసుకుని తమ స్వస్థలాలకు తరలి వెళ్లిపోయారు.

గాయని ప్రార్థనలు

ప్రముఖ సినీ గాయని నిత్య సంతోషిని ఈ సందర్భంగా పెద్దదర్గాను దర్శించుకున్నారు. తన కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి వచ్చిన ఆమెకు దర్గా ముజావర్ అమీర్ ఘనంగా స్వాగతం పలికి దర్గా చరిత్ర, విశేషాలను వివరించారు. ప్రధాన గురువులు, ఇతర గురువుల మజార్లతోపాటు ప్రస్తుతం ఉరుసు జరుగుతున్న హజరత్ అమీనుల్లా హుసేనీ సాహెబ్ మజార్‌ను దర్శించుకుని ప్రార్థనలు చేశారు.




ఉరుసు ముగింపు ప్రార్థనలు నిర్వహిస్తున్న పీఠాధిపతి, దర్గాలో సినీ గాయని నిత్య సంతోషిణి

కాశినాయన ఆశ్రమ అభివృద్ధికి చర్యలు

కాశినాయన : కాశిరెడ్డినాయన ఆశ్రమ అభివృద్ధికి ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే ఈ అంశంపై కేంద్ర మంత్రికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి లేఖ రాయగా ... తాజాగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఎంపీలు విజయసాయిరెడ్డి, వైఎస్‌అవినాష్‌రెడ్డిలతో కలిసి బుధవారం ఢిల్లీలో కేంద్ర అటవీ శాఖామంత్రి భూపేంద్రయాదవ్‌ను కలవనున్నారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని నూతన పార్లమెంటు భవనంలో అపాయింట్‌మెంట్ విషయమై ఎంపీలు విజయసాయిరెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డిలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి మాట్లాడుతూ ఎన్నో శతాబ్దాల చరిత్ర కలిగిన జ్యోతిక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తున్న తరుణంలో పదేళ్ల క్రితం అటవీ అధికారులు ఫారెస్టు క్లియరెన్స్ లేదంటూ పనులు నిలుపుదల చేశారని తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం 12.98 హెక్టార్ల భూమి ఆశ్రమ నిర్మాణానికి అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ఫారెస్టు క్లియరెన్స్ కోసం కేంద్ర అటవీశాఖామంత్రిని కలవనున్నట్లు తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు ప్రతి ఏటా ఈ ఆశ్రమాన్ని సందర్శిస్తుంటారు. అయితే అటవీశాఖ అనుమతులు లేని కారణంగా అభివృద్ధి పనులు అటకెక్కాయి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశ్రమ అభివృద్ధి కోసం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఢిల్లీలోని నేషనల్ బోర్డు వైల్డ్‌లైఫ్ స్టాండింగ్ కమిటీ సభ్యులతో అటవీశాఖ అనుమతుల విషయమై చర్చించారు. ఈ నేపథ్యంలో కేంద్ర అటవీశాఖామంత్రిని కలిసి సమస్యను వివరించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



ఎంపీలు విజయసాయిరెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలను కలిసిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కిడ్నాప్ కేసులో ఏడుగురి అరెస్ట్

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన ఆర్‌కే టైల్స్ యజమాని శ్రావణ్‌కుమార్ కిడ్నాప్ కేసులో సోమ, మంగళవారాల్లో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన ఆర్‌కే టైల్స్ యజమాని శ్రావణ్ కుమార్ గుజరాత్‌లోని ఫ్యాక్టరీ యజమానులకు కడపకు చెందిన టైల్స్ వ్యాపారులు నాగబసిరెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, లోకేష్‌నాయుడులపై చాడీలు చెప్పి తీవ్ర ఆర్థికనష్టం కలిగించాడని కిడ్నాప్ ప్లాన్‌కు పథకం వేశారన్నారు. అందులోభాగంగా 17వ తేదీ సాయంత్రం కడప టైల్స్ వ్యాపారులు నాగబసిరెడ్డి, అతడి కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి, అల్లుడు లోకేష్‌నాయుడు మరి కొంతమందితో కలిసి రెండు వాహనాల్లో అమ్మచెరువుమిట్ట ఆర్‌కే టైల్స్ దుకాణం వద్దకు చేరుకున్నారన్నారు. ఆ సమయంలో షాపులో ఉన్నటువంటి శ్రావణ్‌కుమార్, అతడి బావమరిది రమేష్‌లను బెదిరించి, తమకు కలిగిన నష్టంకు సంబంధించి రూ.30 లక్షలకు ఖాళీ ప్రాంసరీ నోట్లపై శ్రావణ్‌కుమార్‌తో సంతకాలు పెట్టించుకునే ప్రయత్నం చేశారన్నారు. శ్రావణ్‌కుమార్ అంగీకరించకపోవడంతో అతడిపై దాడి చేసి, అడ్డువచ్చిన బావమరిది రమేష్‌ను గాయపరిచి, వారిని బలవంతంగా కారులో ఎక్కించుకుని కడప వైపు బయలుదేరారన్నారు. కిడ్నాప్‌పై సమాచారం అందుకున్న డీఎస్పీ కేశప్ప జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేశారన్నారు. దీంతో కిడ్నాప్ జరిగిన గంటలోపే నిందితులను, కిడ్నాప్‌నకు గురైన శ్రావణ్‌కుమార్, రమేష్‌లను గుర్రంకొండ వద్ద పట్టుకోవడం జరిగిందన్నారు. ఘటనలో ప్రధాన నిందితులైన నాగబసిరెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, లోకేష్‌నాయుడులను సోమవారం అరెస్ట్ చేయగా, మంగళవారం కిడ్నాప్‌నకు సహకరించిన కడపకు చెందిన షేక్‌హబీబ్ బాషా, ఖదీరుల్లా, బీహార్‌కు చెందిన నీరజ్‌సహాని, బికేష్‌కుమార్‌లను అరెస్ట్ చేశామన్నారు. పరారీలో ఉన్న హబీబ్, ఖాదర్, వినోద్‌లను త్వరలోనే పట్టుకుంటామని వివరించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ చదువుతున్న ఎస్. గంగరామ్ (21) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. లింగాల మండలం తేర్నాంపల్లి గ్రామానికి చెందిన ఎస్.గంగాధర్, నారాయణమ్మ దంపతులు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఎస్.గంగరామ్ ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. చిన్నకుమారుడు గౌరిశంకర్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం భోజనానంతరం తోటి విద్యార్థులు తరగతి గదులకు వెళ్లగా.. గంగరామ్ క్యాంపస్‌లోని హాస్టల్ గదిలో ఉండి, ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 4 గంటల ప్రాంతంలో పక్కగదిలో ఉన్న విద్యార్థి తలుపు తట్టగా ఎంతసేపటికీ పలకకపోవడంతో వెనుక ఉన్న కిటికీ నుంచి తొంగిచూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే ట్రిపుల్ ఐటీ అధికారులకు విద్యార్థులు తెలియజేశారు. పోలీసులు, ట్రిపుల్ ఐటీ అధికారులు, డైరెక్టర్ సంధ్యారాణి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫ్యాన్‌కి వేలాడుతున్న గంగారామ్‌ను కిందికి దించి ట్రిపుల్ ఐటీలో ఉన్న ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విశాఖ, గుంటూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్-19 జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖపట్నం, గుంటూరు జట్లు విజయం సాధించాయి. కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, సెంట్రల్‌జోన్ జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచిన విశాఖ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. జట్టులోని ఈశ్వర్ రిత్విక్ 134, యువన్ 60 పరుగులు చేశారు. సెంట్రల్‌జోన్ బౌలర్లు 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 49.2 ఓవర్లలో 241 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని వరుణ్‌సాత్విక్ 91, అభినవ్ 80 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు శ్రీవర్ధన్ 4, అచ్యుతహేమంత్‌కుమార్ 3 వికెట్లు తీశారు. దీంతో విశాఖ జట్టు 9 పరుగుల తేడాతో విజయం సాధించింది.

గుంటూరు జట్టు జయకేతనం

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో గుంటూరు, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 45.2 ఓవర్లలో 182 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రెడ్డిరుషీల్ 70, మనోజ్‌రాజు 53 పరుగులు చేశారు. గుంటూరు బౌలర్ షేర్షా 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 41.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని తాఫిక్ 59 పరుగులు చేశాడు. దీంతో గుంటూరు జట్టు 6 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది.



మ్యాచ్ ఆడుతున్న విశాఖ, సెంట్రల్‌జోన్ జట్లు



ఈశ్వర్ రిత్విక్, విశాఖ జట్టు, (134 పరుగులు)



సుజాన్, నార్త్‌జోన్ జట్టు, (70 పరుగులు)

నార్త్‌జోన్ జట్టు జయభేరి

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నార్త్‌జోన్, కడప జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. జట్టులోని సుజాన్ 70 పరుగులు చేశాడు. కడప బౌలర్లు ప్రణవ్‌రెడ్డి 2, అయూబ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 39.4 ఓవర్లలో 158 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రోహిత్ వర్మ 48 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు లోహిత్ 3, కార్తికేయ 3 వికెట్లు తీశారు. దీంతో నార్త్‌జోన్ జట్టు 45 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

చిరుధాన్యాలతో వంటల పోటీలు



సికెదిన్నెలో వంటలను పరిశీలిస్తున్న కేవీకే కోఆర్డినేటర్ వీరయ్య

కడప అగ్రికల్చర్ : అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమ, మంగళవారాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సికెదిన్నె, పెండ్లిమర్రి మండలాల్లోని పలు గ్రామాల్లో 18 ఏళ్ల పైబడిన మహిళలకు చిరుధాన్యాలతో వంటల పోటీలు నిర్వహించారు. సోమవారం సికెదిన్నె మండలంలోని అప్పరాజుపల్లె, బుసిరెడ్డిపల్లె, గోపులాపురం గ్రామాల్లో నిర్వహించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, శాస్త్రవేత్తలు ప్రశాంతి, యోగా మాస్టార్ లక్షుమయ్య, బుసిరెడ్డిపల్లె సర్పంచ్ సుభద్రమ్మలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. మంగళవారం పెండ్లిమర్రి మండలం కొత్తగిరిపల్లె, రెడ్డిపల్లె, పాతసంగటిపల్లె గ్రామాల్లో నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా కేవీకే కోర్డినేటర్ డాక్టర్ వీరయ్య, శాస్త్రవేత్త ప్రశాంతితోపాటు యోగా టీచర్ నాగజ్యోతి, కొత్తగిరిపల్లె సర్పంచ్ మారుతిదేవి వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన మహిళలకు వారు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ వీరయ్య మాట్లాడుతూ చిరుధాన్యాల ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. నేడు చాలా మంది వీటి వాడకానికే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కావున గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా వీటి వాడకాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్‌ఆర్‌సీపీలో చేరిన తప్పెట్ల గ్రామ పంచాయతీ ప్రజలు

వల్లూరు : మండలంలోని తప్పెట్ల గ్రామ పంచాయతీలో మంగళవారం భారీ సంఖ్యలో టీడీపీ నుంచి వైఎస్‌ఆర్‌సీపీలో చేరారు. పంచాయతీ పరిధిలోని తప్పెట్ల, చెరువు కిందిపల్లె గ్రామాలకు చెందిన సుమారు 35 కుటుంబాలకు చెందిన వారు తమ అనుచరులతో టీడీపీ నుంచి వైఎస్‌ఆర్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డిల సమక్షంలో రేనాటి సుబ్బిరెడ్డి, రామిరెడ్డి, శంకర్ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కుంచం సుబ్బారెడ్డి, పీరా, కుంచం వెంకటసుబ్బారెడ్డి, కుంచం చిన్న వెంకట సుబ్బారెడ్డి, కుంచం పుల్లారెడ్డి, పెద్ద వెంకట సుబ్బారెడ్డి, షేక్ అబ్దుల్, నాగమునిరెడ్డి, సగిలి శ్రీనవాసులురెడ్డి, కల్లూరు యల్లారెడ్డి, ముక్కలయ్యగారి భాస్కర్‌రెడ్డి, కుంచం ప్రసాద్‌రెడ్డి, కల్లూరు యోగీశ్వర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, కుంచం పరమేశ్వర్‌రెడ్డి, కల్లూరు కిరణ్ కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, రవి శంకర్‌రెడ్డి, తుమ్మలూరు నారాయణరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు తమ అనుచరులు, కుటుంబాలతో వైఎస్‌ఆర్‌సీపీలో చేరారు. ఈ మేరకు వారికి చెరువుకిందిపల్లె గ్రామంలో ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి పార్టీ కండువాలను కప్పి వైఎస్‌ఆర్‌సీపీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని, ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల పట్ల ఆకర్షితులమై వైఎస్‌ఆర్‌సీపీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి, మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, పార్టీ నేతలు రఘునాథరెడ్డి, రవీంద్రారెడ్డి, బాల మైసూరారెడ్డి, రాజారెడ్డి, పాల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుందూలో వృద్ధుడి మృతదేహం



పెద్ద వీరారెడ్డి(ఫైల్)

చాపాడు : మండల పరిధిలోని శ్రీరాములపేట వద్ద గల కుందూ నదిలో సోమవారం సాయంత్రం కుళ్లిన వృద్ధుడి మృతదేహం బయటపడింది. స్థానికుల ఫిర్యాదు మేరకు చాపాడు పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి విచారణ చేపట్టారు. మృతి చెందిన వ్యక్తి మైదుకూరులోని ప్రొద్దుటూరు రోడ్డులో నివాసం ఉంటున్న బుచ్చిరెడ్డిగారి పెద్ద వీరారెడ్డి(70)గా గుర్తించారు. కుటుంబ సభ్యులతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఆయన శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం కుందూనదిలో శవమై తేలడంతో పెద్ద వీరారెడ్డి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబీకులు, పోలీసులు భావిస్తున్నారు. మృతుడిది చాపాడు మండలం సిద్దారెడ్డిపల్లె కాగా గత కొన్నేళ్లుగా మైదుకూరులో నివాసం ఉంటున్నారు. మృతుడికి వివాహితులైన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

తెలుగుగంగ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి..



కాశినాయన : గంగనపల్లె గ్రామ సమీపంలోని తెలుగుగంగ కాలువలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. తెలుగుగంగ కాలువ గట్టుపైన చెప్పులు, దుస్తులు, పురుగుల నివారణ మందు డబ్బాను స్థానికులు గమనించారు. అనంతరం వారు కాలువ నీటిని పరిశీలించగా తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించారు. కాశినాయన పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఎస్‌ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బయటికి తీశారు. పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతి చెందిన వ్యక్తి ఆచూకీ గుర్తించిన వారు తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



స్వర్ణలత మృతదేహం

లింగాల : మండలంలోని దొండ్లవాగు గ్రామానికి చెందిన చవ్వా స్వర్ణలత (34)సోమవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం వినాయక చవితి కావడంతో స్వర్ణలత ఇంటిని శుభ్రం చేసేందుకు బూజు దులుపుతుండగా స్విచ్ బోర్డు వద్ద వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త రఘునాథరెడ్డి, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహింపజేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై హనుమంతు తెలిపారు.

రైలు కింద పడి..

కమలాపురం : స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసవర్మ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కమలాపురం పట్టణ పరిధిలోని పైడిమాను కాలనీకి చెందిన కొండేటి వెంకటేష్(32) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో తెలిసిందని ఎస్‌ఐ తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు చిన్న వయసు గల కుమారులు, కుమార్తె ఉన్నారు.

కడుపునొప్పి తాళలేక..

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు గ్రామానికి చెందిన అన్నారెడ్డి లక్ష్మీభవానీ (33) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్‌ఐ రాజారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలంకూరు గ్రామానికి చెందిన లక్ష్మీభవానీ కడుపు నొప్పితో తరచూ ఇబ్బంది పడుతుండేది. ఈ క్రమంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈమె భర్త ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. మృతురాలి తల్లి పద్మావతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు

బద్వేలు అర్బన్ : బద్వేలు మండలం కోనసముద్రం పంచాయతీ జోగిరెడ్డిగారిపల్లె గ్రామంలో సోమవారం జరిగిన తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా బాణాసంచా పేల్చడంతో తేనెటీగలు ఒక్కసారిగా గ్రామస్తులపై దాడి చేశాయి. ఈ దాడిలో భార్యాభర్తలైన గురయ్య, సుబ్బమ్మలతోపాటు రామసుబ్బారెడ్డికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనం సాయంతో వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స అందించారు. ప్రస్తుతం వారు కోలుకుంటున్నారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి

వేంపల్లె : రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని జగన్ అభిమాని కావూరి జయకుమార్ ఆకాంక్షించారు. ఆయన సోమవారం ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రజా చైతన్య యాత్రను ప్రారంభించారు. ముందుగా వైఎస్ ఆర్ ఘాట్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి దివంగత వైఎస్‌ఆర్ సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్‌ఆర్ పేద ప్రజల సంక్షేమానికి శ్రీకారం చుట్టారని, ఆయన బాటలో జగన్ పయనిస్తూ.. ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. దాదాపు 100 రోజుల పాటు ప్రజాచైతన్య యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. వారిని చైతన్యపరచనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత కావలి కృష్ణతేజ, నాయకులు పుల్లయ్య, చాను, రామాంజనేయులు, అంజి, ప్రసాద్, గంగరాజు, కొమ్మురి మరియదాస్, జావేద్, సావిత్రి, నరసమ్మ, చలపతి, పరమేష్, రెడ్డిరాజా, మాబు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా చైతన్య యాత్ర ప్రారంభిస్తున్న నాయకులు

తోడుకోసం వచ్చి.. తిరిగిరాని లోకాలకు

- లారీని ఢీకొన్న కారు
- యువకుడి దుర్మరణం



ముద్దనూరు : తన స్నేహితుడికి తోడు కోసం వచ్చి ఓ యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఆగివున్న లారీని కారు ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 17న (ఆదివారం) రాత్రి ఎర్రగుంట్లకు చెందిన బాబ్జీ అనే డ్రైవరు ముద్దనూరుకు కారును అద్దెకు తీసుకుని వచ్చారు. ముద్దనూరుకు వచ్చే సమయంలో.. బాబ్జీ తిరిగి ఇంటికి వెళ్లడానికి తోడుగా అదే గ్రామంలోని ఆశ్రమం వీధికి చెందిన శరత్‌సాయి(23)ని పిలుచుకుని వచ్చాడు. శరత్‌సాయి అన్న శశికాంత్ కూడా కారులో ముద్దనూరు వచ్చాడు. ఆదివారం రాత్రి 11.10 గంటలకు ముద్దనూరులో వ్యక్తిని వదిలి తిరిగి ముగ్గురూ కారులో ఎర్రగుంట్లకు బయలుదేరారు. స్థానిక స్టేట్‌బ్యాంక్ దాటగానే రోడ్డు పక్కనే నిలిచివున్న లారీని కారు ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవరు పక్క సీటులో కూర్చున్న శరత్‌సాయి అక్కడికక్కడే చెందాడు. డ్రైవరు బాబ్జీ చేయి విరిగింది. బాధితుడిని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



లారీని ఢీకొన్న కారు (ఇన్‌సెట్) మృతి చెందిన శరత్‌సాయి